క్లుప్తంగా

మంత్రి ఉత్తమ్‌కు ఆహ్వానం


మంత్రిని సన్మానిస్తున్న యాదవ కులపెద్దలు

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లో ఆదివారం నిర్వహించే పెద్దమ్మ తల్లి – గంగమ్మ తల్లి జాతరకు హాజరువాలని పలువురు యాదవ పెద్దలు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కోరారు. ఈమేరకు మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం మంత్రిని శాలువ, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో జక్కుల మల్లయ్య, యల్లావుల రాములు, జక్కుల నరేందర్, జక్కుల శంభయ్య, పాశం రామరాజు, సుంకరి శివరామ్ యాదవ్, కోడి ఉపేందర్, జక్కుల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చిలుకూరు: మండల కేంద్రంలో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సైదులు మంగళవారం తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


నిరసన తెలుపుతున్న కార్మికులు

కోదాడ: అపరిష్కృతంగా ఉన్న ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం కోదాడ ఆర్టీసీ డిపోలో కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం, యాజమాన్యం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో లీలావతి, రంగమ్మ, రాంబాబు, పుల్లయ్య, ఎస్ఎస్‌రావు, అబ్దుల్, బాబు, జీఎంరావు, సంజీవ్, సీహెచ్ ఎస్‌రావు, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

30న మండల స్థాయి క్రీడాపోటీలు

మునగాల: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 30న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు ప్రధానోపాధ్యాయుడు పిడతల వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులు మాత్రమే ఈ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అండర్–14, అండర్–17విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయుడు ధృవీకరించిన బోనఫైడ్ సర్టిఫికెట్‌తో హాజరు కావాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

నేడు మండల స్థాయి ఆటల పోటీలు

నడిగూడెం: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి ఎండీ సలీం షరీఫ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్– 14, అండర్– 17 బాల, బాలికలకు కబడ్డీ, వాలీబాల్, ఖో ఖో, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రోడ్లపై సంచరించే పశువులను గోశాలకు తరలిస్తాం

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ మున్సిపాలిటీలో ప్రధాన రోడ్లపై సంచరిస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే పశువులను గోశాలకు తరలిస్తామని మున్సిపల్ కమిషనర్ యాకుబ్‌పాషా మంగళవారం తెలిపారు. యజమానులు తమ పశువులను ఇళ్ల వద్ద కట్టేసుకోవాలని, లేదంటే సమాచారం ఇవ్వకుండానే గోశాలకు తరలిస్తామని పేర్కొన్నారు.

హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న గోపగాని రవికుమార్

భానుపురి : ఎన్నికల్లో విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపగాని రవికుమార్ అన్నారు. మంగళవారం సూర్యాపేటలోని ధర్మభిక్షం భవన్‌లో నిర్వహించిన ఏఐఎస్ఎఫ్ పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విద్యార్థుల హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగం సమస్యలతో సతమతమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో బాణోతు అభి, జలాలు, చరణ్, చేతన్ పాల్గొన్నారు.

అధ్వానంగా మేజర్ కాల్వ

- కంపచెట్లతో నిండిన పాలారం కాల్వ
- పలు చోట్ల పూడిపోవడంతోపాటు దెబ్బతిన్న లైనింగ్
- చివరి భూములకు అందని నీరు

నడిగూడెం: మండల పరిధిలోని సిరిపురం సమీపంలో సాగర్ ఎడమ కాల్వకు అనుబంధంగా ఉన్న పాలారం మేజర్ కాల్వ అధ్వానంగా మారింది. ఈ కాల్వ పరిధిలో నడిగూడెం మండలం సిరిపురం, వల్లాపురం, అనంతగిరి మండలం త్రిపురవరం, పాలారం, చనుపల్లి గ్రామాలకు సాగు నీరు అందుతుంది. మేజరు కాల్వతో పాటు పలు గ్రామాలకు మైనర్ కాల్వలున్నాయి. ఆయకట్టు 4,700 ఎకరాలుండగా కేవలం రెండు వేల ఎకరాలకు మాత్రమే సాగు నీరు అందుతుందని రైతులు వాపోతున్నారు. గతంలో ఆధునీకరణ పనులు చేసినా ఫలితం లేకుండా పోయిందని పేర్కొంటున్నారు. కాల్వలకు గత కొద్ది సంవత్సరాలుగా మరమ్మత్తులు చేయకపోవడంతో కాల్వలో చెత్తా చెదారం చేరి, పలు చోట్ల పూడిపోవడంతో పాటు, లైనింగ్ కూడా దెబ్బతిన్నది. చివరి భూములకు నీరందక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బావులు తీయించుకొని సాగు

పాలారం మేజర్ కాల్వతో పాటు, పలు మైనర్ కాలువలు సిరిపురం సమీపం నుంచి వల్లాపురం, త్రిపురవరం, పాలారం వరకు పలు చోట్ల పూడిపోయాయి. కంపచెట్లమయంగా మారాయి. లైనింగ్ కూడా పూర్తిగా దెబ్బతిన్నది. వల్లాపురం నుంచి త్రిపురవరం వరకు కాల్వలో నాచుపేరుకుపోయింది. గత్యంతరం లేక కాల్వ కింద రైతులు బోర్లు వేసుకోవడంతోపాటు, బావులు తీయించుకొని సాగు చేస్తున్నారు.


వల్లాపురంలో గడ్డితో ఉన్న పాలారం మేజర్ కాల్వ

రైతులే స్వచ్ఛందంగా పూడిక తీత

పాలారం మేజర్ కాల్వ పరిధిలోని వల్లాపురం, త్రిపురవరంలో పలువురు రైతులు స్వచ్ఛందంగా కాల్వలో ఉన్న నాచు, పిచ్చి మొక్కలను తీయడంతోపాటు పూడికతీత పనులు స్వచ్ఛందంగా చేసుకుంటున్నారు. కాల్వకు పూర్తి స్థాయిలో ఆధునీకరణ పనులు చేపట్టి చివరి భూములకు నీరందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.


త్రిపురవరం వద్ద పాలారం మేజర్ కాల్వ దుస్థితి

నీరందక ఇబ్బందులు పడుతున్నాం



సిరిపురం, వల్లాపురం గ్రామాల వద్ద కాల్వ పూడిపోవడంతో పాటు, లైనింగ్ బాగా దెబ్బతిన్నది. దీంతో నీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం. ప్రతి సీజన్‌కు ఒకసారి వల్లాపురం, త్రిపురవరం, చనుపల్లి గ్రామాలకు చెందిన రైతులం స్వచ్ఛందంగా నాచు తొలగించే పనులు చేసుకుంటున్నాం.

– నిందుచర్ల వెంకటేశ్వర్లు, రైతు, వల్లాపురం

పూర్తి స్థాయిలో ఆధునీకరణ పనులు చేపట్టాలి



పాలారం మేజర్ కాల్వ పరిధిలో 4,700 ఎకరాల ఆయకట్టు ఉంది. కానీ చివరి గ్రామాలైన త్రిపురవరం, పాలారం వరకు చుక్క నీరు కూడా రావడం లేదు. అధికారులు విడుదల చేసే 80 క్యూసెక్కుల నీరు సరిపోవడం లేదు. 200 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తే చివరి భూములకు సరిపడా నీరందుతుంది.

– గుర్రం వెంకటరెడ్డి, రైతు, త్రిపురవరం

సంపద వనాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి


సంపద వనాలను పరిశీలిస్తున్న సీఆర్‌డీ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి

మునగాల: సంపద వనాలపై అధికార యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ వహించాలని కమిషనర్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ కార్యాలయం (సీఆర్‌డీ) ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి బాబ్జీ కోరారు. మంగళవారం మునగాల, బరాఖత్‌గూడెం గ్రామపంచాయితీల శివారులో ఉన్న సంపదవనాలను ఆయన సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సంపదవనాల్లో నాటిన ప్రతి మొక్కనూ పరిరక్షించాలన్నారు. ఆయన వెంట మండల పంచాయతీ అధికారి దారా శ్రీనివాస్, పంచాయతీ రాజ్ డీఈ హర్ష, ఏఈ వసంత, ఉపాధి హామీ పథకం ఏపీఓ శైలజ, ఈసీ కళ్యాణ్, టీఏలు శ్రీధర్‌రెడ్డి, శేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్లు నారగాని కృష్ణవేణి, దొంతిరెడ్డి సులోచన, మునగాల, బరాఖత్‌గూడెం గ్రామాల పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, శ్వేత పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడిగా నయీం

కోదాడ: బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడిగా ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఎస్‌కే నయీం ఎంపికయ్యారు. మంగళవారం కోదాడలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఆ పార్టీ కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జి బొల్లం మల్లయ్యయాదవ్ పేర్కొన్నారు.

31న జనవిజ్ఞాన మహాసభ


సన్నాహక సమావేశంలో పాల్గొన్న సభ్యులు

కోదాడ: జిల్లా కేంద్రంలో ఈ నెల 31న నిర్వహించే జనవిజ్ఞాన వేదిక జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని జేవీవీ జిల్లా అధ్యక్షుడు రమేష్ కోరారు. మంగళవారం కోదాడ బాలుర పాఠశాల ఆవరణలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించేందుకు జేవీవీ తన వంతు కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌కే జాఫర్, ఆంజనేయులు, డీఎస్ స్వామి, బడుగుల సైదులు, అబ్దుల్‌పాష, దండాల మధుసూదన్‌రెడ్డి, పుప్పాల కృష్ణమూర్తి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామికి అభిషేకం

చిలుకూరు: శ్రావణమాసం చివరి మంగళవారం సందర్భంగా చిలుకూరు కాలువ ఒడ్డున గల అభయాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, ఆకుపూజ జరిపించారు.

పవిత్రోత్సవాలు ప్రారంభం

సూర్యాపేట : జిల్లా కేంద్రంలోని ప్రసిద్ధ శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రతి సంవత్సరం నిర్వహించే పవిత్రోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు అగ్నిప్రతిష్ఠ, మూల మంత్ర హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు, ఆలయ కార్య నిర్వహణ అధికారి వై.శ్రీనివాసరెడ్డి, అర్చకులు సంకర్షణ ఆచార్యులు, శ్రీహరిచార్యులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి


హుజూర్‌నగర్: ఫీవర్ సర్వే చేస్తున్న ఆశ కార్యకర్తలు


నడిగూడెం: సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ మున్సిపాలిటీలో ఫీవర్ సర్వే కొనసాగుతోంది. మంగళవారం పట్టణంలోని వివిధ వార్డుల్లో సర్వే నిర్వహించి సీజనల్ వ్యాధులు, డ్రై డేపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు 5వ వార్డులో స్ప్రే చేయించి, బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యాకుబ్‌పాషా, వార్డు అధికారులు, మెప్మా, మున్సిపల్ సిబ్బంది ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు

నడిగూడెంలో ఫీవర్ సర్వే

నడిగూడెం: మండల కేంద్రంలో మంగళవారం త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఫీవర్ సర్వే నిర్వహించారు. మురుగు కాల్వల్లో నీరు నిల్వ ఉండకుండా, ఇళ్ల పరిసరాల్లో పిచ్చి మొక్కలు లేకుండా చూడాలన్నారు. దోమలు, ఈగల సంచారం లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విష జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దుర్గా ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ కృష్ణమూర్తి, ఆరోగ్య కార్యకర్తలు సుజాత, రాధ, గ్రామ పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ వెంకన్న, ఆశా కార్యకర్తలు సైదమ్మ, శ్రీలక్ష్మి, సునీత, లక్ష్మి పాల్గొన్నారు.

మఠంపల్లి: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పారిశుద్ధ్యంపై గ్రామపంచాయతీ అధికారులు, హెల్త్‌సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ హరిసింగ్ అన్నారు. మంగళవారం మండలంలోని యాతవాకిల్లలో గ్రామస్తులు జ్వరాలబారిన పడ్డారని వచ్చిన ఫిర్యాదులతో గ్రామంలో పారిశుద్ధ్య పనులు పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు. ఆయన వెంట గ్రామపంచాయతీ కార్యదర్శి, సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వంటిపులి శ్రీనివాస్ తదితరులున్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆజాద్

నేరేడుచర్ల: విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పీడీఎస్‌యూ 50 ఏళ్లుగా రాజీలేని పోరాటాలు నిర్వహిస్తోందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్ అన్నారు. పీడీఎస్‌యూ 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం నేరేడుచర్ల స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన నిర్వహించిన వేడుకలో వారు మాట్లాడారు. ప్రభుత్వ విద్య బలోపేతానికి ఉద్యమాలు చేపట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సమావేశంలో సంఘం నాయకులు సయ్యద్ హుస్సేన్, వాస కరుణాకర్, విజయ్, అశోక్, చక్రవర్తి, యశ్వంత్, త్రివేణి, నవ్య, రాకేష్, నరేందర్, ధనుష్ తదితరులున్నారు.

సుల్తాన్‌పూర్‌తండాలో వైభవంగా బోనాలు


బోనాలతో ఆలయానికి ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు, యువతులు

మఠంపల్లి: శ్రావణమాసం పురస్కరించుకుని మండలంలోని సుల్తాన్‌పూర్‌తండాలో మంగళవారం బోనాల వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు, యువతులు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి బొడ్రాయి, ముత్యాలమ్మకు నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

పులిచింతలకు 45,026 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

హుజూర్‌నగర్: పులిచింతల ప్రాజెక్టుకు సాగర్, టెయిల్‌పాండ్, మూసీ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో మరింత పెరిగింది. సోమవారం 29,920 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో మంగళ వారం 45,026 క్యూసెక్కులుగా నమోదైంది. దీంతో ప్రాజెక్టులోని 2 క్రస్ట్ గేట్లను 2.50 మీటర్లు పైకి ఎత్తి స్పిల్‌వే ద్వారా 41,580 క్యూసెక్కుల నీటిని, విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా 16 వేల కూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలకు ప్రస్తుతం 45.35 టీఎంసీల నీరు ఉంది. పూర్తి రిజర్వాయర్ నీటి మట్టం 53.34 మీటర్లు కాగా ప్రస్తుతం 53.26 మీటర్ల వరకు నీరు ఉంది. ప్రాజెక్టులో 175 అడుగులకు గాను 174.73 అడుగుల వరకు నీరు ఉంది.

జెన్‌కోలో 104 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి

పులిచింతల ప్రాజెక్టులోని తెలంగాణ జెన్‌కోలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. ఈ కేంద్రంలో నాలుగు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. 16 వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ 104 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసి తెలంగాణ గ్రిడ్‌కు అనుసంధానం చేసినట్లు ప్రాజెక్టు ఎస్ఈ దేశ్యా నాయక్ తెలిపారు.

వచ్చే నెల 5న బీసీ విద్యార్థి గర్జన

చిలుకూరు: బీసీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వచ్చే నెల 5న కోదాడలో నిర్వహించే బీసీ విద్యార్థి గర్జన సభను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం కోదాడ నియోజకవర్గ అధ్యక్షుడు ఇనుగుర్తి వెంకటరమణాచారి కోరారు. మంగళవారం చిలుకూరు మండల పరిధిలోని రామాపురం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు నిగిడాల వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్

- బీజేపీ రాష్ట్ర నాయకురాలు శ్రీలతారెడ్డి

గరిడేపల్లి: ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ రాష్ట్ర నాయకురాలు చల్ల శ్రీలతారెడ్డి ఆరోపించారు. మంగళవారం గరిడేపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన మండల సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా బీజేపీ సభ్యత్వ మండల ఇన్‌చార్జ్‌లుగా జనిగల శ్రీనివాస్, కుక్కడపు వెంకటేశ్వర్లు, చిత్తలూరు సోమయ్యను నియమించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నర్సింగ్ అంజయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు పోకల వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, జెనిగల శ్రీనివాస్, సోమయ్య, యడవెల్లి చంద్రశేఖర్‌రెడ్డి, నర్సింగ్ నాగసైదులు, సుందరి రమేష్, తాళ్ల నరేష్, రావుల ఆంజనేయులు, జానకి రాంరెడ్డి, బొల్లెపల్లి శ్రీనివాస్, మోదాల గంగాధర్ పాల్గొన్నారు.


నేరేడుచర్లలో మాట్లాడుతున్న చల్లా శ్రీలతారెడ్డి

హుజూర్‌నగర్‌లో బీజేపీ సభ్యత్వ వర్క్‌షాపు

నేరేడుచర్ల: హుజూర్‌నగర్ నియోజకవర్గంలో బీజేపీ సభ్యత్వాన్ని భారీగా నమోదు చేయించాలని ఆపార్టీ హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ చల్లా శ్రీలతారెడ్డి అన్నారు. మంగళవారం నేరేడుచర్ల మండల కేంద్రంలోని బీజేపీ సభ్యత్వ వర్క్‌షాప్‌లో పాల్గొని మాట్లాడారు. సెప్టెంబరు మొదటి వారం నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు సభ్యత్వ నమోదు కొనసాగించాలన్నారు. నాయకులు సమన్వయంతో పని చేసి సభ్యత్వాలను నమోదు చేయించాలన్నారు. అనంతరం బీజేపీ పట్టణ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జ్‌లుగా తాళ్ల నరేందర్‌రెడ్డి, ఉరిమళ్ల రామ్మూర్తి, వేమిరెడ్డి శంకర్‌రెడ్డి, మండల ఇన్‌చార్జ్‌లుగా చింతకుంట్ల రాజేష్‌రెడ్డి, పవన్, సతీష్‌లను నియమించారు. సమావేశంలో నేరేడుచర్ల పట్టణ, మండల అధ్యక్షులు సత్యనారాయణరెడ్డి, విజయ్‌కుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వెంకటేశ్వర్లు, నాగిరెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, బక్కిరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

నాణ్యమైన ఎరువులు, విత్తనాలు విక్రయించాలి


మాట్లాడుతున్న ఎల్లయ్య

మునగాల: రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు విక్రయించాలని వ్యవసాయ శాఖ కోదాడ డివిజన్ ఏడీఏ ఎల్లయ్య అన్నారు. మంగళవారం మునగాల మండల కేంద్రంలోని రైతువేదికలో ఎరువుల డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు డీలర్లు నకిలీ విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు విక్రయిస్తే వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ ఎదుట సిరిపురం గ్రామస్తుల రాస్తారోకో

నడిగూడెం: మండల పరిధిలోని సిరిపురంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల కాలనీ, బుడిగజంగాల కాలనీకి విద్యుత్ సరఫరా చేయాలని కాలనీ వాసులు మంగళవారం నడిగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత రెండు నెలలుగా తమ కాలనీలకు విద్యుత్ సరఫరా నిలిపివేశారని ఆరోపించారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. వారిలో సోపాల జానకిరాములు, నిదానపు రాములు, నామలింగం, ఉపేందర్, వెంకన్న, యలమంద, రాజలింగం తదితరులున్నారు.


రాస్తారోకో చేస్తున్న సిరిపురం గ్రామస్తులు

గ్రామీణ కృషి అనుభవం ఎంతో ముఖ్యం

మోతె: వ్యవసాయ డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు గ్రామీణ కృషి అనుభవం ఎంతో ముఖ్యమని కేవీకే శాస్త్రవేత్త ఆదర్శ్ అన్నారు. మంగళవారం మోతె మండల కేంద్రంలో సికింద్రాబాద్ లయోలా అకాడమీ బీఎస్సీ వ్యవసాయ డిగ్రీ కోర్సు విద్యార్థులకు గ్రామీన వ్యవసాయ స్థితిగతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వ్యవసాయంలో జరుగుతున్న మార్పులు, నూతన వ్యవసాయ విధానాల గురించి స్థానిక రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ పటం ద్వారా రైతులకు గ్రామ వనరులు, నీటి వనరులు, వ్యవసాయ దిగుబడులు, చీడపీడల నివారణ వంటి అంశాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అరుణ, రైతులు కట్ట వెంకట్‌రెడ్డి, లింగారెడ్డి, రాంరెడ్డి, శేఖర్, లింగరాజు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పోడుభూములకు పట్టాలివ్వాలి


వినతిపత్రం అందజేస్తున్న గిరిజన నాయకులు

మఠంపల్లి: మండలంలోని పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజనులకు ప్రభుత్వం పట్టాలివ్వాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు భూక్యా పాండునాయక్ కోరారు. మంగళవారం స్థానికంగా ఆ సంఘం నాయకులు, గిరిజనులతో కలిసి డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

కోర్టు ఆర్డర్ ధిక్కరణ.. ఇద్దరి రిమాండ్

తుంగతుర్తి: కోర్టు ఇచ్చిన ఇంజక్షన్ ఆర్డర్‌ను ఉల్లంఘించిన ఇద్దరిని రిమాండ్ చేసినట్లు సీఐ శ్రీను నాయక్ తెలిపారు. గతంలో తుంగతుర్తి మండల పరిధిలోని అన్నారం గ్రామ శివారులో ఎల్లబోయిన భిక్షం కొనుగోలు చేసిన భూమికి కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చిందని, ఆ భూమి తమదంటూ అన్నారం గ్రామానికి చెందిన గుండాల బుచ్చయ్య, అతడి భార్య గుండాల ఉప్పమ్మ, గుండాల మాధవి, షేక్ అఖిల్‌పాష భిక్షంపై దాడి చేశారు. అదే సమయంలో కూలీ పనికి వచ్చిన మారగాని శ్రీను అడ్డం వెళ్లగా అతడి చేతికి గొడ్డలి తగిలి గాయమైంది. ఈ ఘటనపై ఎల్లబోయిన భిక్షం ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుచ్చయ్య, ఉప్పమ్మ, మాధవి, షేక్ అఖిల్ పాషపై కేసు నమోదయ్యిందని సీఐ తెలిపారు. ఈ క్రమంలో గుండాల బుచ్చయ్య, అతడి భార్య గుండాల ఉప్పమ్మను మంగళవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా జడ్జి వారికి నల్లగొండ జిల్లా జైలుకు రిమాండ్ విధించారని తెలిపారు.

మట్టపల్లి క్షేత్రంలో కృష్ణాష్టమి వేడుకలు


మట్టపల్లి ఆలయంలో కృష్ణుడికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు ధర్మకర్తలు


హుజూర్‌నగర్‌రూరల్: ఉట్టి కొడుతున్న యువకులు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో మంగళవారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. కృష్ణుడికి పంచామృతాభిషేకాలు జరిపించారు. కార్యక్రమంలో ఈఓ నవీన్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, వెంకటాచార్యులు, ఆంజనేయాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, వంశీకృష్ణమాచార్యులు ,టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు, భక్తులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌రూరల్: మండలంలో బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో మంగళవారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, చిన్ని కృష్ణుడికి అభిషేకం, విష్ణుసహస్రనామ పారాయణం, అష్టోత్తర పూజ జరిపించారు. అనంతరం ఆలయంలో ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ఈఓ లక్ష్మణరావు, అర్చకులు ముడుంబై హరిష్‌కుమార్ చార్యులు, సిబ్బంది కిరణ్‌కుమార్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో..

నడిగూడెం: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ఆట, పాటలతో పాటు, శ్రీ కృష్ణుడు, రాధా వేశధారణలో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ వాణి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, సుధా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.